15-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - ఇది తయారై-తయారుచేయబడిన అనాది డ్రామా, ఈ డ్రామాలో ప్రతి పాత్రధారి పాత్ర నిశ్చితమై ఉంది, మోక్షము ఎవ్వరికీ లభించదు"

ప్రశ్న:- శివబాబా అశరీరి, వారు శరీరములోకి ఎందుకు వస్తారు? వారు ఏ పని చేస్తారు మరియు ఏ పని చేయరు?

జవాబు:- బాబా అంటారు - పిల్లలూ, నేను ఈ శరీరములోకి కేవలం మీకు మురళిని వినిపించేందుకే వస్తాను. నేను మురళిని వినిపించే పనినే చేస్తాను. నేను తినడానికి, తాగడానికి రాను. నేను మీకు కొత్త రాజధానిని ఇవ్వడానికి వచ్చాను. ఇకపోతే రుచి అయితే ఇతని ఆత్మ తీసుకుంటుంది.

పాట:- ఆకాశ సింహాసనాన్ని వదిలి రా... (ఛోడ్ భీ దే ఆకాష్ సింహాసన్...)

ఓంశాంతి. పాటితోనైతే మనకు సంబంధము ఉందో, ఆ పాటలే మ్రోగించడం జరుగుతుంది. ఆకాశములో సింహాసనమంటూ ఏదీ లేదు. ఈ అంతరిక్షాన్నే ఆకాశము అని అంటారు. ఇకపోతే ఆకాశతత్వములో సింహాసనమేమీ లేదు. అలాగే పరమపిత పరమాత్మ ఈ ఆకాశతత్వములో సింహాసనముపై ఏమీ ఉండరు. తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు - పరమపిత పరమాత్మనైన నేను మరియు ఆత్మలైన మీరెవరైతే పిల్లలో, ఇరువురమూ ఈ సూర్య, చంద్ర, నక్షత్రాలను దాటి ఉంటాము, దానిని మూలవతనము అని అంటారు. ఏ విధంగా ఇక్కడ ఆకాశములో సూర్య, చంద్ర, నక్షత్రాలు ఉన్నాయో, అచ్చంగా అలాగే వృక్షము వలె మహాతత్వములో కూడా ఆత్మలు ఉంటాయి. ఏ విధంగా నక్షత్రాలు ఏ ఆధారమూ లేకుండా ఆకాశములో ఉన్నాయో, అలాగే ఆత్మలమైన మనము మరియు తండ్రి అయిన పరమాత్మ, మనమందరమూ మహాతత్వములోనే ఉండేవారము. నక్షత్రాల వలె ఉంటాము. జ్ఞానసూర్యుడు, జ్ఞానచంద్రుడు మరియు జ్ఞానసితారలు. ఎప్పుడెప్పుడైతే దుఃఖము కలుగుతుందో, అప్పుడు నేను వస్తాను అని అయితే అర్థం చేయించారు. పాతదానిని తప్పకుండా కొత్తదిగా తయారుచేయాలి. పాత ప్రపంచములోనే దుఃఖము ఉంటుంది. కలియుగములో ఎంతో దుఃఖము ఉంది. స్వర్గములోనైతే సుఖమే సుఖము ఉంటుంది. నేను మళ్ళీ వచ్చి సహజ జ్ఞానాన్ని మరియు సహజ రాజయోగాన్ని నేర్పించాల్సి ఉంటుంది. మీరు రండి అని అందరూ పిలుస్తారు. కృష్ణుని విషయములో సింహాసనాన్ని వదిలి రండి అని ఎవ్వరూ అనరు. కృష్ణుని విషయములో సింహాసనము అన్న పదము శోభించదు. అతను యువరాజు కదా. చిన్న పిల్లలను తండ్రి తన ఒడిలో లేక తన పక్కనే కూర్చోబెట్టుకోవచ్చు కానీ ఎప్పుడైతే రాజ్య సింహాసనము లభిస్తుందో, అప్పుడే సింహాసనము అని అంటారు. తండ్రి అర్థం చేయిస్తారు, ఆత్మలు మూలవతనములో నక్షత్రాల వలె ఉంటారు. ఆ తర్వాత అక్కడి నుండి నంబరువారుగా వస్తూ ఉంటారు. సితారలు ఎలా పడిపోతాయో చూపిస్తారు కదా. అలాగే అక్కడి నుండి కూడా ఆత్మలు వచ్చి నేరుగా గర్భములోకి వెళ్తారు. ఇది బాగా నోట్ చేసుకోండి - ప్రతి ఆత్మ సతో, రజో, తమోలను దాటాల్సి ఉంటుంది. ఏ విధంగా మొట్టమొదట లక్ష్మీ-నారాయణులు వస్తారు, వారు సతో, రజో అవస్థలను దాటుతూ, పునర్జన్మలను తీసుకుంటూ-తీసుకుంటూ మళ్ళీ తమోప్రధాన అవస్థను పొందవలసిందే. ప్రతి ఒక్కరి విషయములో ఇదే విధంగా ఉంటుంది. ఎవ్వరూ తిరిగి వెళ్ళలేరు. ఇబ్రహీం, బుద్ధుడు వస్తారు, వారు కూడా సతో, రజో, తమోలను దాటాల్సి ఉంటుంది, పునర్జన్మలను తీసుకోవాల్సి ఉంటుంది. ద్వాపరములో ధర్మ స్థాపకులు వస్తారు. అక్కడి నుండి పునర్జన్మలు ప్రారంభమవుతాయి, మళ్ళీ తమోప్రధానముగా అవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు వారి సద్గతిని ఎవరు చేస్తారు? సద్గతి దాత అయితే ఒక్క శివుడే. వారు అంటారు, అందరి సద్గతి చేయడానికి నేను రావలసి ఉంటుంది. నా వంటి పనిని ఇంకెవ్వరూ చేయలేరు. నేను దేవీ-దేవతా ధర్మాన్ని కూడా స్థాపన చేస్తాను. మీకు రాజయోగాన్ని నేర్పిస్తున్నాను. గతి మరియు సద్గతి దాతను నేనే. ఎప్పుడైతే మీరు పవిత్రంగా అవుతారో, అప్పుడు నేను మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్తాను. మీ సద్గతిని కూడా చేస్తాను. మీతోపాటు అనేక ధర్మాలవారు ఎవరైతే ఉన్నారో, ఆ ధర్మ స్థాపకుల సహితంగా అందరినీ ఉద్ధరిస్తాను. మిమ్మల్ని జ్ఞానముతో అలంకరించి స్వర్గాధిపతులైన లక్ష్మిని లేక నారాయణుడిని వరించేందుకు యోగ్యులుగా చేస్తాను, ఆ తర్వాత మిమ్మల్ని తిరిగి తీసుకువెళ్తాను. అందరినీ మొదట ముక్తిధామానికి పంపిస్తాను. నేను అందరి సద్గతి దాతను కూడా. ఇతర ధర్మ స్థాపకులెవరైతే వస్తారో, వారు సద్గతి చేయలేరు. వారు కేవలం తమ ధర్మ స్థాపనను చేసి ఆ ధర్మాన్ని వృద్ధి చేయడం మొదలుపెడతారు. తమ ధర్మములోనే పునర్జన్మలు తీసుకుంటూ సతో, రజో, తమోలను దాటుతారు. ఇప్పుడు అందరూ తమోప్రధానులుగా ఉన్నారు. ఇప్పుడు వీరిని పావనులుగా, సతోప్రధానులుగా ఎవరు

తయారుచేస్తారు? తండ్రి స్వయముగా కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు. భగవంతుడు వచ్చి అందరి సద్గతిని కూడా చేస్తారు, భారత్ ను స్వర్గముగా కూడా తయారుచేస్తారు. జీవన్ముక్తి కొరకు రాజయోగాన్ని నేర్పిస్తారు, అందుకే తండ్రికి ఇంతటి మహిమ ఉంది. గీత సర్వశాస్త్రమయి శిరోమణి, కానీ కృష్ణుని పేరును వ్రాయడంతో భగవంతుడిని మర్చిపోయారు. భగవంతుడు సర్వుల సద్గతిదాత, అందుకే గీత అన్ని ధర్మాలవారి కొరకు ధర్మశాస్త్రము, అందరూ దీనిని అంగీకరించవలసిందే. సద్గతినిచ్చే శాస్త్రము ఇంకేదీ లేదు. సద్గతిని ఇచ్చేవారు ఒక్కరే, వారిదే గీత. పిల్లలైన మీకు సద్గతినిచ్చే జ్ఞానాన్ని ఇస్తున్నారు. గీతలో శివుని పేరు ఉన్నట్లయితే అది అన్ని ధర్మాలవారి శాస్త్రమయ్యేది. తండ్రి అందరికీ చెప్తారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నాతో యోగాన్ని జోడించినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి మరియు మీరు నా ధామానికి వచ్చేస్తారు. అన్ని ధర్మాలవారి సద్గతిని చేసేది కూడా నేనే. మిగిలినవారంతా తమ ధర్మాలను స్థాపించేందుకు వస్తారు. మోక్షము లభించదా అని మనుష్యులు అడుగుతారు, లభించదు అని తండ్రి అంటారు. ఆత్మలందరూ ఎవరైతే ఉన్నారో, వారందరి పాత్ర డ్రామాలో నిశ్చితమై ఉంది. ఎవరి పాత్రా మారదు. ప్రతి ఒక్కరి పూర్తి పాత్ర యొక్క అనాది డ్రామా రచించబడి ఉంది. డ్రామా అనాది, దానికి ఆదిమధ్యాంతాలు లేవు. సృష్టి ఆది అని సత్యయుగాన్ని అంటారు మరియు అంతిమము అని కలియుగాన్ని అంటారు. ఇకపోతే డ్రామాకు ఆదిమధ్యాంతాలు లేవు. డ్రామా ఎప్పుడు తయారయిందో చెప్పలేరు. ఈ ప్రశ్న ఉత్పన్నమవ్వజాలదు.

బాబా అర్థం చేయించారు, ఇతర శాస్త్రాలేవైతే ఉన్నాయో వాటి ద్వారా ప్రతి ఒక్కరూ తమ ధర్మ స్థాపనను చేసుకున్నారు కానీ సద్గతిని పొందలేదు. వారు ధర్మ స్థాపన చేసారు, ఆ తర్వాత వృద్ధి జరుగుతూ వచ్చింది. ఇవి ఎంత గుహ్యమైన పాయింట్లు. ఇవి వ్యాసము వ్రాసే విధంగా ఉన్నాయి. ఇక్కడ ప్రగల్భాలు పలికే విషయమేమీ లేదు. ఇది గెలుపు-ఓటముల డ్రామా. సత్యయుగములో పరమాత్మను స్మృతి చేయాల్సిన అవసరం ఉండదు. పరమాత్మను స్మృతి చేసినట్లయితే బ్రాహ్మణులైన మమ్మల్ని వారు రచించారు అన్న విషయాన్ని కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. నేను రచయితను అని మీకు సమ్ముఖంగా చెప్తున్నాను. ఈ సంగమము బ్రాహ్మణుల కొత్త ప్రపంచము. పిలక గురించి అయితే ఎవ్వరికీ తెలియదు. విరాట రూపాన్ని తయారుచేస్తారు. అందులో దేవత, క్షత్రియ, వైశ్య, శూద్రులను చూపిస్తారు. బ్రాహ్మణులను మర్చిపోయారు. సత్యయుగములో దేవతలు, కలియుగములో శూద్రులు. సంగమయుగ బ్రాహ్మణుల గురించి తెలియదు. ఈ రహస్యాన్ని తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. బాబా అంటారు - పవిత్రత లేకుండా ఎప్పుడూ ధారణ జరగదు. బాబా అర్థం చేయిస్తారు - ఎన్ని వేద-శాస్త్రాలు ఉన్నాయి, వాటిని ఊరేగిస్తూ ఉంటారు. మందిరాల నుండి చిత్రాలను బయటకు తీసి ఊరేగించి తిరిగి మందిరాలలోకి తీసుకువస్తారు. బాబా అనుభవజ్ఞులు. శాస్త్రాలతో బండిని నింపి దాన్ని ఊరేగిస్తారు, అలాగే దేవతల చిత్రాలను కూడా బళ్ళల్లో పెట్టి ఊరేగిస్తారు. ఇదంతా భక్తి మార్గము.

మీరు శివశక్తులు. మీరు మొత్తం విశ్వము యొక్క సద్గతిని చేస్తారు. కానీ దిల్వాడా మందిరము ఖచ్చితంగా వీరి స్మృతిచిహ్నమేనని ఎవరికీ తెలియదు. ఇటువంటి మందిరము ఇంకెక్కడా లేదు. జగదాంబ ఉన్నారు, శివబాబా కూడా ఉన్నారు. అక్కడ శక్తులకు ఎత్తైన పీఠంలా కూడా తయారుచేయబడి ఉన్నాయి. భక్తి మార్గములో మళ్ళీ ఇటువంటి మందిరాలు తయారుచేయబడతాయి, మళ్ళీ వినాశనం జరుగుతుంది కావున ఇవన్నీ అంతమైపోతాయి. సత్యయుగములో మందిరాలేవీ ఉండవు. ఇదంతా భక్తి మార్గపు విస్తారము. జ్ఞానములోనైతే మౌనంగా ఉండాలి. ఒక్క శివబాబానే స్మృతి చేయాలి. శివబాబాను మరచి ఇతరులను స్మృతి చేసినట్లయితే అంతిమములో ఫెయిల్ అయిపోతారు. ఫెయిల్ అవ్వకూడదు. మనుష్యులు మరణించేటప్పుడు వారికి రాముడిని తలచుకోమని చెప్తారు, కానీ అలా గుర్తుకు రాదు. అంత్యకాలములో ఎవరైతే నారాయణుడిని స్మరిస్తారో... అని అంటూ ఉంటారు. అది ఈ సమయములోని విషయమే. ఈ ప్రపంచానికి మంటలైతే అంటుకోనున్నాయి. అంత్యకాలములో ఎవరైతే నారాయణుడిని స్మరిస్తారో... తప్పకుండా ఇప్పుడు మీరు - మేము నారాయణుడిని లేక లక్ష్మిని వరిస్తాము అని భావిస్తారు. మీరు స్వర్గము కొరకు తయారవుతున్నారు. బాబా తప్ప ఈ జ్ఞానాన్ని ఇంకెవ్వరూ ఇవ్వలేరు. ఇప్పుడు నాకు శివబాబా తెలియజేసారు అని ఈ బాబా కూడా అంటారు. దీనిని శక్తి సైన్యము లేక పాండవ సైన్యము అని అంటారు. పాండవులు అన్న పేరు మహారథులకు ఉంది. శక్తులను పులిపై స్వారీ చేస్తున్నట్లుగా చూపిస్తారు. తండ్రి అంటారు - ఏ విధంగా కల్పపూర్వము సహజ రాజయోగాన్ని నేర్పించానో, అచ్చంగా అదే విధంగా నేర్పిస్తున్నాను. ఏ పాత్ర అయితే నడుస్తుందో, కల్పకల్పము అదే నడుస్తుంది. ఇందులో తేడా రాదు. మళ్ళీ కల్పకల్పము ఈ పాత్రే నడుస్తుంది. బాబా అంటారు, మీకు గుహ్యాతి గుహ్యమైన విషయాలను వినిపిస్తాను. తర్వాత ఏమవుతుంది అనేది తర్వాత వినిపిస్తాను కదా. ఇప్పుడే అంతా వినిపించేస్తే మరి ఇక తిరిగి వెళ్ళిపోనా? అంతిమం వరకూ కొత్త పాయింట్లను

వినిపిస్తూ ఉంటారు. మనం గీతను ఎంతగానో మహిమ చేస్తాము. కానీ ఆ గీత మరియు మహాభారతములో హింసాయుత యుద్ధాలు మొదలైనవాటిని చూపించారు. ఇప్పుడు యుద్ధమైతే లేదు. మీది యోగబలము యొక్క విషయము. అహింస యొక్క అర్థము ఎవరికీ తెలియదు. కేవలం స్త్రీని నరకానికి ద్వారము అని అనేసారు. వాస్తవానికి ఇరువురూ నరకానికి ద్వారాలే. ఇప్పుడు వారిని మళ్ళీ స్వర్గానికి ద్వారముగా ఎవరు తయారుచేయాలి? ఆ శక్తి భగవంతునికే ఉంది. ఈ పాటలను బాబా తయారుచేయించారు, వాటిని తయారుచేసేవారు కొందరు సరిగ్గా తయారుచేసారు, కొందరు తప్పుగా తయారుచేసారు, కలిపేసారు. ఓ రాత్రి ప్రయాణీకుడా, అలసిపోకు... ఇటువంటి పాటలను నేనే తయారుచేయించాను. ఇక్కడి విషయాలే వేరు. ఇది గోశాల కూడా మరియు వనవాసము కూడా, కానీ వీటి అర్థాన్ని అర్థం చేసుకోరు. నేను ఎవరినైనా ఎత్తుకు వెళ్ళిపోయానా? కరాచీకి వచ్చేయండి అని ఎవరితోనైనా అన్నానా? ఈ శక్తులను అడగండి. డ్రామాలో పాత్ర అలా ఉంది. ఎవరిపైనైతే అత్యాచారాలు జరిగాయో వారు వచ్చేసారు. కావున రైట్ ఏమిటి అనేది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. శాస్త్రాలలో ఏదైతే రాయబడి ఉందో అదంతా భక్తి మార్గము. వాటి ద్వారా నన్ను కలుసుకోలేరు, నా వద్దకు రాలేరు. నేను మార్గదర్శకుడిగా అయి ఇక్కడకు రావలసి ఉంటుంది. గృహస్థులుగా లేని వారి తనువును ఎందుకు తీసుకోలేదు అని అడుగుతారు. అరే, నేను గృహస్థుని తనువులోకే వచ్చి అతనికి జ్ఞానం ఇవ్వాల్సి ఉంటుంది. అతని యొక్క 84 జన్మల గురించే తెలియజేస్తాను. కావున ఇవి ఎంతటి గుహ్యమైన విషయాలు. ఇవి కొత్త ధర్మము కొరకు కొత్త విషయాలు, జ్ఞానము కూడా కొత్తదే. తండ్రి అంటారు, కల్పకల్పము నేను ఈ జ్ఞానాన్ని వినిపిస్తాను. నేను కల్పకల్పము ధర్మ స్థాపన చేయడానికి వస్తాను అని ఎప్పుడూ ఎవ్వరూ అనరు. మేము మళ్ళీ రాజ్యం చేయడానికి వచ్చాము అని లక్ష్మీ-నారాయణులు ఇరువురూ అనరు. అక్కడ ఈ జ్ఞానమంతా కనుమరుగైపోతుంది. శాస్త్రాలైతే తర్వాత అనేకము తయారుచేసారు. బ్రాహ్మణులైన మన కొరకు ఒక గీతయే ఉంది. నేను ధర్మ స్థాపన కూడా చేస్తాను మరియు అందరి సద్గతి కూడా చేస్తాను. ఇది డబుల్ పని కదా. ఇప్పుడు నేను వినిపించేది సత్యమా లేక వారు వినిపించేది సత్యమా అనేది మీకే తెలుసు. నేను ఎవరిని? నేను సత్యము. నేను వేద-శాస్త్రాలనేమీ వినిపించను. ఇతనైతే ఎన్నో చదివారు కానీ అవేమైనా వినిపిస్తారా. ఇక్కడ శివబాబా కొత్త-కొత్త విషయాలను వినిపిస్తారు, వారు అశరీరి. వారు కేవలం ఈ మురళీని వినిపించే పని చేయడానికే వస్తారు, అంతేకానీ తినడానికి, తాగడానికి రారు. నేను పిల్లలైన మీకు మళ్ళీ రాజధానిని ఇవ్వడానికే వచ్చాను. రుచి అనేది ఇతని ఆత్మ తీసుకుంటుంది.

ప్రతి ఒక్కరి ధర్మమూ వేరు, వారు తమ ధర్మశాస్త్రాన్ని చదవాలి. ఇక్కడైతే ఎన్నో శాస్త్రాలను చదువుతూ ఉంటారు, వీటిలో సారమేమీ లేదు. ఎంతగా చదువుతూ ఉంటారో, అంతగా నిస్సార ప్రపంచముగా అవుతూ ఉంటుంది. తమోప్రధానముగా అవ్వవలసిందే. మొట్టమొదట సృష్టిలోకి మీరే వచ్చారు. బ్రాహ్మణులైన మీరు మాత-పితల ద్వారా జన్మ తీసుకున్నారు. అటువైపు అసురీ కుటుంబము ఉంది, ఇక్కడ ఈశ్వరీయ కుటుంబము ఉంది, ఆ తర్వాత వెళ్ళి దైవీ ఒడిని తీసుకుంటారు, స్వర్గానికి యజమానులుగా అవుతారు. మాత-పితల యొక్క మతమనుసారముగా నడుచుకున్నట్లయితే స్వర్గపు అపార సుఖాలు లభిస్తాయి. ఇకపోతే రుద్ర జ్ఞాన యజ్ఞములో విఘ్నాలైతే తప్పకుండా కలుగుతాయి. తండ్రి అంటారు - పిల్లలూ, వికారాలపై విజయం పొందడం ద్వారానే మీరు జగత్ జీతులుగా అవ్వగలరు. వివాహం చేసుకోకపోతే బలహీనంగా ఉండిపోతారు అనేమీ కాదు. సన్యాసులు పవిత్రంగా అవుతారు, మరి వారు ఎంత లావుగా, ఆరోగ్యంగా ఉంటారు. ఇక్కడ ఇది మెదడు పని, ఇందులో కష్టపడాలి, దధీచి ఋషి ఉదాహరణ ఉంది కదా. సన్యాసులకైతే ఎంతో ఆరోగ్యకరమైన భోజనము లభిస్తూ ఉంటుంది, స్వయంగా బాబా కూడా వారికి ఎంతో ఆరోగ్యకరమైన భోజనము తినిపించేవారు. ఇక్కడైతే ఎంతో పథ్యము పాటించవలసి ఉంటుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞానము యొక్క మంచి ధారణ కొరకు పవిత్రతా వ్రతాన్ని ధారణ చేయాలి. ఇది అంత్యకాలము, అందుకే ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ గుర్తుకురానట్లుగా అభ్యాసము చేయాలి.

2. దధీచీ ఋషి వలె సేవ చేస్తూ వికారాలపై విజయం పొంది జగత్ జీతులుగా అవ్వాలి.

వరదానము:- సమయము యొక్క వేగము అనుసారంగా సర్వ ప్రాప్తులతో సంపన్నముగా ఉంటూ మాయాజీతులుగా

అయ్యే తీవ్ర పురుషార్థీ భవ

బాప్ దాదా ఏ ప్రాప్తులనైతే కలిగించారో, ఆ సర్వ ప్రాప్తులను స్వయములో జమ చేసుకుని నిండుగా ఉండండి, ఎటువంటి లోపమూ ఉండకూడదు. ఎక్కడైతే నిండుతనములో లోపము ఉంటుందో, అక్కడ మాయ కదిలిస్తుంది. మాయాజీతులుగా అయ్యేందుకు సహజ సాధనము - సదా ప్రాప్తులతో నిండుగా ఉండటము. ఏ ఒక్క ప్రాప్తి నుండి కూడా వంచితులుగా ఉండకండి, సర్వ ప్రాప్తులు ఉండాలి. సమయము యొక్క వేగము అనుసారంగా ఏ సమయంలోనైనా ఏమైనా జరగవచ్చు, అందుకే తీవ్ర పురుషార్థులుగా అయి ఇప్పటి నుండే నిండుగా అవ్వండి. ఇప్పుడు లేకుంటే మరెప్పుడూ లేదు.

స్లోగన్:- సత్యత మరియు నిర్భయతా శక్తులు తోడుగా ఉన్నట్లయితే ఎటువంటి కారణము కదిలించలేదు.